

ఉల్లి ధరలో మాయాజాలం



- గరిష్ఠం దక్కేది కొందరికే..
- వ్యాపారులు కనుసన్నల్లో ధరల నిర్ణయం
- యార్డుల కంటే గ్రామాల్లోనే ఎక్కువ ధర
- భారీగా జీరో.. సెస్సుకు గండి
- చోద్యం చూస్తున్న అధికారులు
- టెండరు విధానంలోనూ రైతులకు అన్యాయమే..

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 28:



ఈ రైతు పేరు నారాయణ. వర్కూరు గ్రామంలో తనకున్న నాలుగెకరాల పొలంలో ఉల్లి పంటను సాగు చేశాడు. దాదాపు ఎకరాకు రూ.60 వేల దాకా ఖర్చు చేశాడు. పంట దిగుబడిని కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకు వస్తే.. వ్యాపారులు క్వింటానికి రూ.2,500 చెల్లిస్తామని గిరి గీయడంతో ఇదేమి అన్యాయమంటూ ఉల్లిని మళ్లీ ట్రాక్టరులో తీసుకుని గ్రామానికి వెళ్లిపోయాడు. అక్కడ వ్యాపారులు క్వింటానికి రూ.3 వేలు చెల్లించినట్లు రైతు నారాయణ తెలిపారు. మార్కెట్ యార్డు కంటే గ్రామాల్లో వ్యాపారులే నయమని రైతులు అంటున్నారు. ఉల్లి ధరలో ఇదేమి మాయాజాలం అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్రంలో ఎక్కువ విస్తీర్ణంలో ఉల్లిని సాగు చేస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులకు చివరకు కడగండ్లే మిగులుతున్నాయి. ఈ సంవత్సరం ప్రస్తుత ఖరీఫ్‌లో దాదాపు 50వేల ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. 50వేల ఎకరాల్లో దిగుబడిని లెక్కేస్తే.. 25 లక్షల క్వింటాళ్ల ఉల్లి దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే సెప్టెంబరు 1వ తేదీ నుంచి మంగళవారం 24వ తేదీ వరకు కర్నూలు మార్కెట్ యార్డుకు దాదాపు 90వేల క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్ముకున్నారు. అదే విధంగా గ్రామాల్లో వ్యాపారులు దాదాపు 2 లక్షల క్వింటాళ్ల ఉల్లిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ 2 లక్షల క్వింటాళ్లకు సంబంధించి మార్కెట్ కమిటికి వ్యాపారులు చెల్లించాల్సిన సెస్సుకు గండి కొట్టినట్లయింది. మరో వైపు కర్నూలు జిల్లాలోని ఉల్లి కొనుగోలు కేవలం ఒక్క కర్నూలు మార్కెట్ యార్డులోనే కొనసాగుతున్నది. రైతులు ఈ మార్కెట్ యార్డులో తమకు గిట్టుబాటు ధర లభిస్తుందనే ఆశతో మారుమూల గ్రామాల నుంచి కర్నూలు యార్డుకు ఉల్లిని అమ్ముకునేందుకు తరలివస్తున్నారు. అయితే.. అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల సిండికేట్‌తో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. కేవలం కొంత మంది రైతులకు మాత్రమే గరిష్ఠ ధర దక్కుతుండగా.. నాణ్యత లేదనే సాకుతో కమిషన్ ఏజెంట్లు మధ్యస్థ, కనిష్ఠ ధరలు మాత్రమే అధిక మొత్తం ఉల్లికి ధరను నిర్ణయిస్తుండటంతో రైతులు రైతులు కన్నీళ్లు పెట్టుకోవడం తప్ప.. వారికి మరో దారి కనిపించడం లేదు. గ్రామాల్లోకి రైతులు వచ్చి అధిక ధరను చెల్లిస్తామని వ్యాపారులు బతిమిలాడినా కర్నూలు మార్కెట్ యార్డులో ఎక్కువ ధర లభిస్తుందనే ఆశతో వస్తే కమిషన్ ఏజెంట్లు మాత్రం తక్కువ ధరను చూపి రైతులను నట్టేట ముంచుతున్నారు. కొంత మంది రైతులు మరోదారి లేక కమిషన్ ఏజెంట్లకు అమ్ముకుంటే చాలా మంది రైతులు గ్రామాలకే ఉల్లిని తీసుకెళ్లి అక్కడ అమ్ముకుంటున్నారు. టెండరు విధానంలో రైతులకు ఎక్కువ ధర లభిస్తుందని, లైసెన్సు తీసుకున్న వ్యాపారులంతా పోటీ పడి ఉల్లిని కొనుగోలు చేస్తారని అధికారులు చెబుతున్న మాటలు నీటిమూటలయ్యాయి.



మార్కెట్ యార్డులో మాయాజాలం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగైంది. ఇంత పెద్ద మొత్తంలో ఉల్లి పంట రాష్ట్రంలో ఎక్కడా సాగు కాకపోవడం గమనార్హం. మహారాష్ట్ర తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే పెద్ద ఎత్తున రైతులు ఉల్లిని సాగు చేస్తున్నారు. అయితే.. అధికారుల నిర్లక్ష్యం, కమిషన్ ఏజెంట్ల సిండికేట్‌తో ఉల్లి రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. గత రెండేళ్లుగా భారీ వర్షాలు, తుఫాన్‌లతో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు రూ.60వేల దాకా ఉల్లి పంట సాగు కోసం రైతులు ఖర్చు చేస్తే కేవలం ఎకరాకు 20 క్వింటాళ్ల కంటే తక్కువే దిగుబడి పొందారు. కనీసం ఈ ధరకైనా అమ్ముకుందామని రైతులు ఎంతో ఆశతో ఉన్నా కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు తమ జేబులు నింపుకోవడానికే అక్రమాలకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సంవత్సరం రైతులు సెప్టెంబరు 1వ తేదీ నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లిని అమ్మకానికి తీసుకురావడం మొదలైంది. అయితే.. యార్డులో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతుండటంతో కొంత మంది రైతులు మరోదారి లేక ఈ యార్డులోనే అమ్ముకుంటుండగా.. మరికొంత మంది రైతులు గ్రామాలకు తీసుకెళ్లి అక్కడ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. సెప్టెంబరు నెలలో 24వ తేదీ వరకు దాదాపు 90వేల మెట్రిక్ టన్నుల ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారు. ఈ మొత్తం ఉల్లిలో కొంత ఉల్లిని కేవలం క్వింటానికి రూ.297లకు మాత్రమే కొనుగోలు చేశారు. మధ్యస్థ రకం ఉల్లికి రూ.1,500 నుంచి రూ.3,639, గరిష్ఠంగా క్వింటానికి రూ.4,129లు రైతులకు దక్కింది. కనిష్ఠ, మధ్యస్థ ధరలకు అమ్ముకున్న రైతులు తాము నష్టపోయామంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

ధర గిట్టుబాటు గాక వెనుదిరుగుతున్న రైతులు

కర్నూలు మార్కెట్ యార్డులో ధర తమకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని, తిరిగి తమ గ్రామాలకే అధిక రవాణా ఖర్చులు భరించి తీసుకెళ్తున్నారు. గ్రామాల్లోనే వ్యాపారుల నుంచి క్వింటానికి రూ.3వేలకు పైగా ధర లభిస్తుంటే.. మార్కెట్ యార్డులో కేవలం రూ.2వేలు మాత్రమే ఇస్తున్నారని, అందువల్ల మార్కెట్ యార్డులో నుంచి రవాణా ఖర్చులు భరించి మళ్లీ గ్రామాలకే తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నామని రైతులు చెబుతున్నారు. మార్కెట్ యార్డులో ఎక్కువ ధర రావాల్సిందిపోయి.. దానికి విరుద్ధంగా గ్రామాల్లో వ్యాపారుల కంటే తక్కువ ధరకు తీసుకుంటున్నారని, ఇదేమి అన్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు.

టెండరు విధానం అమలులోకి వచ్చినా ప్రయోజనం శూన్యమే

గతంలో కర్నూలు మార్కెట్ యార్డులో వ్యాపారులే రైతుల వద్దకు వెళ్లి నాణ్యతను పరిశీలించి ధరను నిర్ణయించే వారు. దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని నిర్ణయించి మిగిలిన పంట ఉత్పత్తుల మాదిరిగా కొనుగోళ్లను టెండరు విధానంలో అమలు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో వ్యాపారులు తమకు టెండరు విధానం ఏ మాత్రం సమ్మతి కాదని, పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఒకదశలో కొనుగోళ్లను కూడా నిలిపివేశారు. అయితే.. అప్పట్లో మార్కెట్ కమిటీ అధికారులు వ్యాపారుల చేత బలవంతంగా టెండరు విధానాన్ని అమలు చేశారు. రైతులు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించి మద్దతు పలికారు. అయితే.. పాత సీసాలో కొత్తసారా అన్న చందంగా రైతుల పరిస్థితి మారింది. గతంలో మాదిరిగానే తక్కువ ధర లభించడంతో రైతులు కన్నీళ్లతో బాధపడటం తప్ప.. మరోదారి కనిపించడం లేదు. వాస్తవంగా కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలుకు సంబంధించి 30 మంది వ్యాపారులకు లైసెన్సులు ఇచ్చారు. అయితే.. ప్రస్తుతం కేవలం ఐదుగురు వ్యాపారులు మాత్రమే ఉల్లి టెండరులో పాల్గొంటున్నారు. ఈ ఐదుగురు రైతులు తమకు అనుకూలమైన ధరను మాత్రమే నిర్ణయిస్తున్నారు. వీరు కొనుగోలు చేసిన ఉల్లిని మిగిలిన వ్యాపారులు కొనుగోలు చేస్తూ ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తుండటం గమనార్హం. లైసెన్సు తీసుకున్న వ్యాపారులు ఎందుకు టెండరులో పాల్గొనడం లేదో అధికారులు సరైన జవాబు ఇవ్వలేక పోతున్నారు. వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో కూడా అధికారులు చెప్పలేకపోతున్నారు. వ్యాపారులందరి టెండరులో పాల్గొనేలా చేస్తే పోటీ ఎక్కువై ధర తమకు సక్రమంగా అంది న్యాయం జరుగతుందని రైతులు చెబుతున్నారు.

భారీగా సెస్సుకు గండి

ఈ సంవత్సరం ఖరీఫ్‌లో దాదాపు 50వేల ఎకరాల్లో ఉల్లిని రైతులు సాగు చేశారు. ఎకరాకు 50 క్వింటాళ్ల దిగుబడిని లెక్కించినా దాదాపు 25 లక్షల క్వింటాళ్ల దిగుబడి రైతులకు అందుతుందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఈ మొత్తంపై సెస్సు పెద్ద ఎత్తున రావాల్సి ఉండగా.. వ్యాపారుల సిండికేట్‌తో తక్కువ ధర లభిస్తుందనే భయంతో రైతులు గ్రామాల్లోనే దళారులు, వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మార్కెట్ యార్డుపై రైతుల భయాన్ని ఆసరగా తీసుకుని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దాదాపు వంద మంది దళారులు, వ్యాపారులు గ్రామాల్లోకి లారీలను తీసుకెళ్లి రైతుల నుంచి తక్కువ తూకాలు వేసి కొనుగోలు చేస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని వ్యాపారులు హైదరాబాదు, తమిళనాడు, ఢిల్లీ, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి రెట్టింపు ధరలకు అమ్ముకుని రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లి వల్ల మార్కెట్ కమిటీకి రూ.లక్షల్లో ఆదాయం సెస్సు రూపంలో రావాల్సి వున్నా గ్రామాల్లోనే వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లిని రాత్రిపూట తరలించి సెస్సుకు ఎగనామం పెడుతున్నారు. దీనివల్ల రూ.లక్షల్లో సెస్సు ఆదాయాన్ని మార్కెట్ కమిటీ పొందలేకపోతుంది. వ్యాపారుల సిండికేట్‌ను నిరోధించి కర్నూలు మార్కెట్ యార్డుపై రైతుల్లో నమ్మకాన్ని పొందేలా అధికారులు కఠినమైన చర్యలు తీసుకోలేకపోవడం దారుణం.

సిండికేట్ వ్యాపారాన్ని అరికట్టండి



కర్నూలు మార్కెట్ యార్డుల పెద్ద ఎత్తున ఉల్లి రైతులకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటానికి రూ.700 కూడా చాలా మంది రైతులకు దక్కడం లేదు. టెండరు విధానాన్ని అమలులోకి తెచ్చామని రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న అధికారుల మాటలు నీటి మూటలవుతున్నాయి. 30 మంది వ్యాపారులు ఉంటే.. కేవలం ఐదుగురు మాత్రమే టెండరులో పాల్గొంటున్నారు. మార్కెట్‌యార్డులో ధర గిట్టుబాటు గాక రైతులు తమ గ్రామాలకు తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారంటే కర్నూలు మార్కెట్ యార్డు వల్ల రైతులకు ప్రయోజనం ఉందా? అధికారులు ఆలోచించాలి

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

గిట్టుబాటు ధర అందిస్తున్నాం



రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అధిక వర్షాల వల్ల ఉల్లి నాణ్యత పడిపోతోంది. నాణ్యత లేని కారణంగా వ్యాపారులు అధిక ధరను వ్యాపారులు రైతులకు అందించలేకపోతున్నారు. కనిష్ఠ ధర రూ.200-300 మాత్రమే ఉందని, అయితే.. పూర్తిగా డ్యామేజీ కావడంతోనే ఆ ఉల్లికి ధర ఎక్కువ రావడం లేదు. ప్రస్తుతం నాణ్యమైన ఉల్లికి కర్నూలు మార్కెట్ యార్డులో మంచి ధర లభిస్తోంది. గరిష్ఠ ధర నాణ్యమైన ఉల్లికి క్వింటానికి రూ.4వేలకు పైగానే వస్తుంది. ఉల్లి టెండరులో వ్యాపారులంతా పాల్గొనేలా చర్యలు తీసుకుంటాం. మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న చెక్‌పోస్టుల ద్వారా వ్యాపారులు పక్క రాష్ట్రాలకు తరలిస్తున్న ఉల్లి నుంచి సెస్సును వసూలు చేస్తున్నాం. ఎక్కడా సెస్సు ఆదాయానికి గండి పడడం లేదు.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు మార్కెట్ యార్డు

గడువులోగా ఇళ్లు కట్టుకోండి

- పూర్తయిన వాటికి సకాలంలో బిల్లులు
- లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు
- కలెక్టర్ జి. రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు, సెప్టెంబరు 28: గతంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శనివారం మన ఇళ్లు.. మన గౌరవం కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని చక్రం లే అవుట్‌లో గృహ నిర్మాణాల లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా గతంలో గృహ నిర్మాణాలు మంజూరైన లబ్ధిదారులు 2024 మార్చి 15వ తేదీలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నట్లయితే బిల్లుల చెల్లింపు సాధ్యమని అన్నారు. ఆ తర్వాత పీఎంఏవై - 2.0 అమలు కానుందని, ఆ లోపల తొలి విడత నిర్మాణాలు, బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా 318 ఇళ్ల స్థలాల లే అవుట్లు ఉండగా మొత్తం 63,676 ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు. వీటిలో పీఎంఏవై అర్బన్ కింద లే అవుట్ల స్థలాల్లో 18,923, సొంత స్థలాల్లో 32,153 గృహ నిర్మాణాలు ఉండగా పీఎంఏవై గ్రామీణ్ కింద సుమారు 12,600 గృహాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రత్యేకించి ఆత్మకూరులోని చక్రం లేఅవుట్ 79 ఎకరాల్లో 2043 ప్లాట్లతో జిల్లాలోనే అతిపెద్ద లేఅవుట్ అన్నారు. ఇందులో 1208 గృహాలను మంజూరు చేసినట్లు చెప్పారు. అయితే ఇందులో 131 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, మిగతా లబ్ధిదారులు కూడా గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ తులసి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఈఈలు హరిగోపాల్, వెంకటేశ్వర్లు, డీఈ రాజారఘువర్మ, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో మోహన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద జలాలతో జలాశయాలు కళకళ

60 రోజుల్లో పోతిరెడ్డిపాడు నుంచి 132 టీఎంసీలు విడుదల



పోతిరెడ్డిపాడు నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 28: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి రాయలసీమ జిల్లాలకు ఈ ఏడాది 60 రోజుల్లో 132 టీఎంసీల నీటిని దిగువ ఉన్న జలాశయాలకు తరలించారు. దీంతో అవి కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా వరదలు రావడంతో శ్రీశైలం జలాశయానికి లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో జూలై 27న పోతిరెడ్డిపాడు నుంచి నీటిని గేట్ల ద్వారా ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. 60 రోజుల్లోనే పోతిరెడ్డిపాడు నుంచి 132 టీఎంసీలు ఎస్సారెమ్సీ కాల్వలోకి విడుదల చేసి తద్వారా బానకచర్ల నీటి సముదాయం నుంచి తెలుగుగంగ, ఎస్కేప్, జీఎన్ఎస్ఎస్ కాల్వలకు మళ్లించి దిగువ ఉన్న జలాశయాలను పూర్తి స్థాయి నీటి మట్టంతో నింపుకున్నారు. దీంతో రాయలసీమకు తాగు, సాగు నీరు, తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి తాగునీరు విడుదల చేశారు. దిగువన ఉన్న జలాశయాలు నిండుకుండలా ఉండటంతో శుక్రవారం పోతిరెడ్డిపాడు నుంచి 13వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. వెలుగోడు జలాశయం పూర్తినీటి సామర్థ్యం 16.95 టీఎంసీలు, అవుకు జలాశయం 4.14 టీఎంసీలు, గోరుకల్లు 12.44 టీఎంసీలు, కడప జిల్లా గండికోట జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 26.85 టీఎంసీలు, బ్రహ్మసాగరం 17.73 టీఎంసీలు. అయితే ఇవన్నీ పూర్తి స్థాయిలో నిండినట్లు నీటి పారుదల శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది శ్రీశైలం జలాశయానికి పూర్తి స్థాయి నీటి మట్టం రాలేదు. ఎగువ రాష్ట్రాల్లోని మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు తక్కువగా కురవడంతో శ్రీశైలం జలాశయానికి పూర్తి నీటి మట్టం 885 అడుగులుకాగా 860 అడుగులకే నీరు చేరింది. దీంతో పోతిరెడ్డిపాడు నుంచి 23 టీఎంసీలు మాత్రమే దిగువవకు విడుదల చేశారు. గతేడాది వెలుగోడు జలాశయానికి కేవలం 6 టీఎంసీలు కూడా రాలేదు. తాగునీటికి సరిపడే నీటిని కూడా నిల్వ చేసుకోలేకపోయాం. దాదాపు రాయలసీమ ప్రాంతంలోని ఏ జలాశయానికి నీళ్లు లేకపోవడంతో లక్షల ఎకరాలు సాగు చేయలేక రైతులు బీడుగా పొలాలు పెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది సకాలంలో వరదలు రావడంతోపాటు జలాశయాలు నిండాయి. ఖరీఫ్, రబీ సీజన్లకు సాగు నీరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఒక టీచర్.. ఇద్దరు పిల్లలు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 28: మండలంలోని పారుమంచాల గ్రామంలోని భైరెడ్డి నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వారికి షాహిద్‌బాషా అనే ఏకోపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. ఈ స్థితిపై ఉపాధ్యాయుడ్ని వివరణ కోరగా పాఠశాల దూరంగా ఉండటంతో చిన్నారులను తల్లిదండ్రులు పంపించడం లేదని తెలిపారు. దీని వల్ల బడికి వస్తున్న ఇద్దరు పిల్లలకే చదువు చెబుతున్నా అన్నారు.



ఇద్దరు విద్యార్థులతో ఉపాధ్యాయుడు షాహిద్‌బాషా

జిల్లాలో క్విక్ రియాక్షన్ టీంలు

- నేర నివారణే లక్ష్యం
- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 28: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నివారణే లక్ష్యంగా క్విక్ రియాక్షన్ టీంలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడించారు. శనివారం నంద్యాలలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న క్యూఆర్టీ జట్టు సభ్యులకు ఎస్పీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్యూఆర్టీ సిబ్బందికి యోగా, వృత్తి నైపుణ్యం, మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ అందించినట్లు చెప్పారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, దేహదారుఢ్యంపై శ్రద్ధ తీసుకునేలా శిక్షణ ఇచ్చామని చెప్పారు. జిల్లాలోని ప్రతి పోలీస్ సబ్ డివిజన్‌కు 11 మంది చొప్పున క్యూఆర్టీ సభ్యులను నియమించామని అన్నారు. సబ్ డివిజన్‌లోని హెడ్ క్వార్టర్స్‌లో వీరు ఉంటూ స్పెషల్ పార్టీ డ్రెస్ కోడ్‌తో ఉంటారనని తెలిపారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు జట్టులోని సభ్యులను వినియోగించుకునే విధంగా తీర్చిదిద్దామని చెప్పారు. విజిబుల్ పోలీసింగ్‌లో ప్రముఖ పాత్ర వహిస్తూ క్యూఆర్టీ పని చేస్తుందని వివరించారు. ధర్నాలు, రాస్తారోకోలు, నాటుసారా, మద్యం, గంజాయి, లాడ్జీల తనిఖీలను క్యూఆర్టీ టీమ్ నిర్వహిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్, ఎలీషావలి, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.




క్యూఆర్టీ జట్టుతో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

గుండెను కాపాడుకుందాం..

● జీవనశైలి లోపాలే అనర్థాలకు కారణం
● నేడు ప్రపంచ గుండె వ్యాధుల నివారణ దినం

ఆధునిక జీవనశైలి గుండె ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఒకప్పుడు 65-70 ఏళ్ల వయస్సులో కనిపించే గుండె జబ్బులు ప్రస్తుతం 25-35 ఏళ్లలోనే దాడి చేస్తున్నాయి. ఉదయం లేచింది మొదలు ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది వృత్తి, వ్యక్తిగత జీవితంలో ఒత్తిడితో చిత్తవుతున్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం చెడు అలవాట్లకు బానిసవుతున్నారు. నిద్రలేమి కొత్త చిక్కులను తెచ్చిపెడుతోంది. ఒత్తిళ్లు, ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం, కాలుష్యం, పొగ తాగే అలవాటు వంటి కారణాలతో హృద్రోగుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 1.90 కోట్ల మంది గుండె జబ్బులతో మరణిస్తున్నారు. అలాగే 54 కోట్ల మంది గుండె జబ్బులతో బాధపడుతున్నారు. దీంతో గుండె జబ్బులపై అవగాహన పెంచడానికి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతి ఏటా సెప్టెంబరు 29న వరల్డ్ హార్ట్ డే నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'యూస్ హార్ట్ ఫర్ యాక్షన్' అన్న నినాదాన్ని ఇచ్చింది. -కర్నూలు(హాస్పిటల్)



గుండె జబ్బుల్లో కనిపించే ప్రధాన లక్షణం ఆయాసం. ఊపిరితిత్తుల నుంచి గుండెకు రక్తం చేరుకునేటప్పుడు కొంత పీడనంతో నిండుతుంది. గుండె కండరం బలహీనపడినా, గట్టిపడినా గుండె చుట్టు ఉండే పొరగట్టి పడినా, ఈ పీడనం మరింత ఎక్కువవుతుంది. దీంతో ఊపిరితిత్తుల్లోని సూక్ష్మ రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి ద్రవం లీకవుతుంది. ఇలా ఊపిరితిత్తుల్లో నీరు చేరి, వాటిలో వ్యాకోచించడం తగ్గుతుంది. ఇది ఆయాసానికి దారి తీస్తుంది. ముఖ్యంగా రాత్రిపూట ఆయాసం ఎక్కువ ఉంటుంది.

కర్నూలు జీజీహెచ్‌కు పెరిగిన రోగులు

కర్నూలు జీజీహెచ్ కార్డియాలజీ విభాగానికి గుండె రోగుల తాకిడి భారీగా పెరిగింది. 2015-16లో కార్డియాలజీ విభాగానికి రెండు డీఎం సీట్లు రావడంతో ఇక్కడ వైద్యుల సంఖ్య పెరిగింది. ఇప్పటి వరకు ఐదు బ్యాచ్‌లు కోర్సు పూర్తి చేసుకుని వైద్యులుగా బయటకు వెళ్లారు. వైద్యుల సంఖ్య పెరగడంతో గత ఐదేళ్లలో రోగుల సంఖ్య 90,475 మంది ఓపీకి వచ్చారు. వీరిలో 14,597 మంది అడ్మిషన్ చేరారు. 2023లో 21వేల మంది ఓపీకి రాగా, 2024లో ఇప్పటి వరకు 15,840 మంది ఓపీ సేవలు ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం కార్డియాలజీ విభాగంలో ప్రొఫెసర్ డా. చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లలితకుమారి, ప్రశాంత్, కిరణ్ కుమార్ రెడ్డి, డా. ఉదయ్ బిందు, డా. రవికిరణ్ పని చేస్తున్నారు.

శారీరక శ్రమ లేకపోవడం వల్లే



శారీరక శ్రమ లేకపోవడం కూడా గుండెజబ్బులకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటివి 30 నిమిషాలు శారీరక శ్రమ ప్రతిరోజు చేయాలి. ఇది గుండెను బలపరుస్తుంది. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తుంది. అలాగే గుండె ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల ఆహారం చాలా ముఖ్యం. జంక్‌ఫుడ్, చక్కెర, అధిక కేలరీలు ఉన్న ఆహారానికి బదులు బాదం, వాల్నట్స్, అవకాడో, క్యారెట్ వంటి పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.

- డా. సీఎస్ తేజానందన్ రెడ్డి, కన్సల్టెంట్ కార్డియాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు)

జీవనశైలి మార్పుల వల్లే గుండె జబ్బులు



మారుతున్న జీవనశైలిలో మార్పుల కారణంగా గుండె సమస్యలు అధికమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 1.79 కోట్లు మంది హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో రాయలసీమ జిల్లాల నుంచి చిన్న వయస్సులోని వారు గుండెజబ్బులతో వస్తుండటం ఆందోళన కలిగిస్తుంది. ఎవరైనా గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా 55-65 ఏళ్ల మధ్యలో ఉన్న వారు ఎక్కువగా గుండెపోటుకు గురవుతున్నారు. ముందస్తు జాగ్రత్తలతో వీటిని నివారించవచ్చు.

- డా.జి. సందీప్ కుమార్, ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

నేడు వరల్డ్ హార్ట్ డే ఉత్సవాలు



వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని ఆదివారం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో వరల్డ్ హార్ట్ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ఉదయం కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏ. క్యాంపు హెల్త్ క్లబ్‌లో వైద్య విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశాం. సాయంత్రం సునయన ఆడిటోరియంలో కలెక్టర్ రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, తిరుపతికి చెందిన కార్డియాలజిస్టు డా. రాజశేఖర్, వరల్డ్ హార్ట్ డేలో పాల్గొంటారు. అనంతరం ఔట్ స్టాండింగ్ పర్సన్ ఆప్ ది ఇయర్‌గా డా. రాజశేఖర్‌కు అవార్డును అందజేస్తాం.

- డా.పి. చంద్రశేఖర్, ప్రొఫెసర్ ఆఫ్ కార్డియాలజీ, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి

అవగాహన కల్పిస్తున్న హార్ట్ ఫౌండేషన్



ముందస్తు జాగ్రత్తలతో గుండె జబ్బులను నివారించవచ్చునన్న ఉద్దేశంతో కార్డియాలజీ ప్రొఫెసర్ డా.పి. చంద్రశేఖర్ 2002, అప్పటి కలెక్టర్ సాయిప్రసాద్ గౌరవాధ్యక్షుడిగా కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. 2003లో నగరంలోని ఎ. క్యాంపులో హార్ట్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. 2003లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే నిర్వహిస్తున్నారు. 2005 నుంచి గుండెజబ్బుల నివారణలో విశేష సేవలు చేసిన వైద్యులకు ఔట్‌స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ పేరుతో అవార్డును ప్రారంభించారు. 2015లో హార్ట్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా మొదటి ఆదివారం హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యులతో అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే హెల్త్ క్లబ్‌లో మెడిటేషన్ హాల్ జిమ్ బ్యాట్‌మింటన్ కోర్సును ఏర్పాటు చేశారు.

గుండె లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు



అప్పటికప్పుడు రక్తనాళాల్లో పూడికలు ఏర్పడటం వల్ల ఆకస్మిక గుండె మరణాలకు దారి తీస్తుంది. చాలా మందిలో బీపీ, మధుమేహం ఉన్నప్పటికీ లక్షణాలు కనబడవు. తెలుసుకునేలోపు నష్టం జరుగుతుంది. కొన్ని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఆయాసం, గుండె నొప్పి, ఎక్కువ చెమటపట్టడం, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటే వైద్యున్ని వెంటనే సంప్రదించాలి.

- డా.ఎ. వసంత కుమార్, సీనియర్ కార్డియాలజిస్టు, శ్రీవిజయదుర్గ కార్డియాక్ సెంటర్, కర్నూలు

గుండెకు సంపూర్ణ రక్షణ



గుండెకు సంపూర్ణ రక్షణకు అవసరమైన విధానాలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన ఆలోచనలతో గుండెపై భారం వేయకూడదు. పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడటం వల్ల యువతపై గుండె వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంది. రక్తపోటు, చక్కెర వ్యాధి, కొవ్వును అదుపులో ఉంచుకోగలిగితే గుండె జబ్బులు రావు.

- డా.సి. రాఘవేంద్ర, సీనియర్ ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్, కర్నూలు

దేవునితో రాజకీయం చేస్తే నాశనమే

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

పగిడ్యాల, సెప్టెంబరు 28: దేవునితో రాజకీయం చేసిన వారు నాశనం కాక తప్పదని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. మండల పరిధిలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మతాలకు సంబంధించిన సాంప్రదాయాలను కొనసాగిస్తారని, అలాంటప్పుడు తప్పని సరిగా డిక్లరేషన్ ఇచ్చి వారి మతాలను గౌరవించడం ఆనవాయితీ అన్నారు. అయితే జగన్ నాలుగు గోడల మధ్యన బైబుల్ చదువుతానని, బయటకు వస్తే హిందువులను, ముస్లింలను గౌరవిస్తానని నాటకాలు ఆడుతున్నాడని విమర్శించారు. తమ మతం మానవత్వం అని చెబుతున్నారని, సీఎంగా ఉన్నప్పుడు నంద్యాలలో ముస్లింలు ఆత్మహత్య చేసుకున్నప్పుడు మానవత్వం ఎక్కడికి పోయిందని ఆమె ప్రశ్నించారు. దొంగ రెడ్లను నమ్మవద్దని, అసలైన రెడ్లను నమ్మి వారి పక్షాన ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకరవాడ వెంకటస్వామి, కట్టుబడి శ్రీనివాసనాయుడు తదితరులు ఉన్నారు.

ఆయిల్ ఫాం తోటలతో లాభాలు

జిల్లా ఉద్యానశాఖాధికారి



నర్సరీలో ఆయిల్‌ఫాం మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి

రుద్రవరం, సెప్టెంబరు 28 : రాయలసీమ జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌ఫాం తోటలను పరిచయం చేసిందని, వాటి వల్ల రైతులకు లాభాలు బాగా ఉంటాయని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు శనివారం అన్నారు. నంద్యాల జిల్లాలో 400 హెక్టార్లు టార్గెట్ లక్ష్యంగా ఉందన్నారు. వీటిలో ఇప్పటి వరకు వంద హెక్టార్లలో ఆయిల్ ఫాం తోటలు సాగు చేయించామన్నారు. ఒక్కో హెక్టారుకు రూ.71వేల సబ్సిడీ అందుతుందన్నారు. పెద్దకంబలూరు మెట్ట సమీపంలో 3ఎఫ్ ఆయిల్‌ఫాం ప్రైవేటు నర్సరీలో మొక్కలను పరిశీలించామన్నారు. జిల్లాలో నవభారత్, తుమ్మల ఆగ్రో, పతంజలి అనే సంస్థల ద్వారా ఆయిల్‌ఫాం తోటలను సాగు చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయని అన్నారు. ఈ పంట నాలుగేళ్లలో చేతికందుతుందన్నారు. పంట సాగులో అంతర్ పంటలు కూడా సాగు చేసుకుని రైతులు అధిక లాభాలను పొందవచ్చన్నారు. ఒక్కో ఎకరాలో పది నుంచి 15 టన్నులు దిగుబడి వస్తుందన్నారు. టన్ను రూ.14 వేల నుంచి 15వేలు ధర ఉంటుందని అన్నారు. సాగు ఖర్చు కేవలం ఎకరాకు రూ.20వేలు వస్తుందన్నారు.

రూ.1.50 కోట్లకు పైగా హోటల్ వ్యాపారి టోకరా

ఆదోని, సెప్టెంబరు 28 : పట్టణంలోని ఓ హోటల్ వ్యాపారి రూ.1.50 కోట్లకు పైగా టోకరా పెట్టినట్లు తెలిసింది. కొన్నేళ్లుగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తూ తెలిసిన వారి దగ్గర నుంచి పెద్ద ఎత్తున రోజువారి ఫైనాన్స్ కింద అప్పులు తీసుకున్నాడు. ఒకరికి తెలియకుండా మరొకరితో రోజువారి వడ్డీ, వారం వడ్డీలు, నెలసరి వడ్డీలకు పెద్ద ఎత్తున అప్పులు తీసుకున్నాడు. మొదట్లో సక్రమంగా కట్టేవాడని, సమయం కంటే ముందుగానే ఫైనాన్స్ తీర్చేవాడని పేరు చెప్పని ఓ ఫైనాన్స్ నిర్వాహకుడు తెలిపారు. వారం రోజుల క్రితం ఫైనాన్స్ వాళ్లు ఒత్తిడి చేయడంతో ఎవరికీ చెప్పా పెట్టకుండా హోటల్ దుకాణానికి తాళం వేసి చిత్తగించాడు. దీంతో ఫైనాన్స్ ఇచ్చిన వాళ్లు మాత్రం లబోదిబోమంటున్నారు.

అంత్యక్రియల హాజరుకు అనుమతి

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 28: ఓ మానసిక వికలాంగుడి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ కర్నూలు ఎస్సీ, ఎస్టీ సెల్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పి.పాండురంగారెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన సి.లక్ష్మీదేవితో పాటు ఆమె కుటుంబీకులు పది మందిని ఈ నెల 13న పోలీసులు అరెస్టు చేశారు. దీంతో వీరిని కోర్టు రిమాండ్‌కు ఆదేశించింది. అయితే లక్ష్మీదేవి పెద్ద కుమారుడు మానసిక వికలాంగుడు కావడంతో ఆలన పాలన లేక అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. దీంతో గ్రామస్థులు వారి న్యాయవాదికి సమాచారం ఇవ్వడంతో అతను కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌లో ఉన్నా కోర్టుకు వచ్చి కేసును విచారించారు. అనంతరం ఆ కుటుంబానికి మొత్తం రెండురోజుల పాటు తాత్కాలిక బెయిల్‌ను మంజూరు చేశారు. మృతుడి అంత్యక్రియలు పూర్తి చేసి రెండు రోజులకు తిరిగి కోర్టులో హాజరు కావాలని ఆదేశించారు. దీంతో కుటుంబం మొత్తం శనివారం జైలు నుంచి విడుదలై వారి స్వగ్రామానికి వెళ్లింది.

సార్.. మీ కాళ్లు మొక్కుతా..

● మా భూమి మాకు ఇప్పించండి
● ఆర్డీవో కార్యాలయంలో రైతు కుటుంబం ఆవేదన



రెవెన్యూ సిబ్బంది కాళ్లకు మొక్కుతున్న రైతు కుటుంబ సభ్యుడు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 28: 'సారు మీ కాళ్లు మొక్కుతా.. మా భూమి మాకు ఇప్పించి న్యాయం చేయండి' అని బాధిత రైతు కుటుంబం శనివారం పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో నిరసనకు దిగింది. ఆస్పరి పెద్ద నాగభూషణం అనే రైతుకు పత్తికొండ పట్టణ శివారులోని సర్వే నెం.744/2లో 16 ఎకరాల 19 సెంట్లు వారసత్వంగా సంక్రమించిన భూమి ఉంది. గత సంవత్సరం డిసెంబరు 2023 వరకు ఆ భూమిపైన సర్వహక్కులు ఉన్నట్లు రికార్డులు ఉన్నాయి. అయితే అదే సర్వే నంబరులోని భూమిలో కొలిమి ఫాతిమాబీకి మూడెకరాల పది సెంట్లు ఉందంటూ రెవెన్యూ అధికారులు రికార్డులు తారుమారు చేశారు. దీంతో బాధిత రైతు నాగభూషణం తన కుమారులు సాంబమూర్తి, వెంకటేశ్వర్లు, హేమాద్రితో పాటు కుటుంబ సభ్యులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. తప్పుడు రికార్డులతో తమకు తీరని అన్యాయం చేశారంటూ రెవెన్యూ అధికారులను నిలదీశారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాధిత రైతు కుటుంబాన్ని నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.



బాధిత రైతు నాగభూషణం

రాయలసీమ ప్రాజెక్టులపై దృష్టి సారించాలి


● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ఆలూరు, సెప్టెంబరు 28 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమరావతి రాజధాని అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టులపైనే కాకుండా రాయలసీమ ప్రాజెక్టులపై కూడా శ్రద్ధ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. శనివారం ఆలూరు ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్‌లో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ప్రాజెక్టులు లేకపోవడంతో వర్షంపైనే ఆధారపడి సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరు ప్రాంతంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేస్తామని చెప్పారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి చేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌తో కలిసి సమస్యలపై చర్చించారు. సమావేశంలో సీపీఐ నాయకులు గిడ్డయ్య, రామాంజినేయులు, భూపేష్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



మంత్రాలయం మంఠం ప్రాంగణంలో భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 28: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. శనివారం సాయంత్రం నుంచి భక్తుల రాక మొదలైంది. దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. శనివారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారాయి.

పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి

మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వం జీవో.నెం.545 ద్వారా పత్తి పంటకు కనీస మద్దతు ధర పొడుగు పింజ రకానికి క్వింటానికి రూ.7,521, పొటి పింజ రకానికి రూ.7,121 సీసీఐ కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ రామాంజనేయులు శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. రైతులు బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర తగ్గినప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందేందుకు సిద్ధం కావాలని, పత్తి పంట ఉత్పత్తులను బాగా ఆరబెట్టి దుమ్ము ధూళి లేకుండా శుభ్రపరిచి పత్తి కొనుగోలు కేంద్రానికి తీసుకుని రావాలని రైతులకు సూచించారు. మద్దతు ధర పొందాలంటే పత్తి గింజ పొడవు 29.50 ఎంఎం నుంచి 30.50 ఎంఎం వరకు ఉండాలని అన్నారు. అదే విధంగా మైక్రో నియర్ వాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాలని స్పష్టం చేశారు.

ఎయిర్‌పోర్టులో సౌకర్యాలు మెరుగుపర్చండి

కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 28: కర్నూలు ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎరోడ్రోమ్ కమిటీ, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టులో మహిళా పోలీసులను కూడా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు నుంచి కర్నూలు వెళ్లే ప్రయాణికులకు విమానాశ్రయం నుంచి ఓర్వకల్లుకు బస్సు సౌకర్యం కల్పించాలని, ఓర్వకల్లు నుంచి కర్నూలుకు వెళ్లే బస్సును వయా ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు వారు కూడా ఒక ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, డీఎఫ్‌వో డీఎంహెచ్‌వో, తహసీల్దార్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047

డిబేట్‌కు కోసిగి విద్యార్థి ఎంపిక



ప్రణయ్ కుమార్ రెడ్డి

కోసిగి, సెప్టెంబరు 28: స్వర్ణాంధ్ర-2047 రాష్ట్ర స్థాయి డిబేట్‌కు కోసిగిలోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి ప్రణయ్ కుమార్ రెడ్డి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్. సమీరారెడ్డి తెలిపారు. ప్రణయ్ కుమార్‌రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 28: ఎస్సీ, ఎస్టీ షెడ్యూల్ జాతులు, అణగారిన వర్గాల ప్రజలపై దాడులు, అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాలులో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో శ్మశానవాటిక సమస్య ఉందని, పట్టణంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కమిటీ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలో ఉన్న 146 సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను సీఎస్ఆర్ నిధులతో ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. నందికొట్కూరు, ఆత్మకూరు, ప్యాపిలి, ఉయ్యాలవాడ మండలాల్లో కులధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన అంశాలను పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2023 డిసెంబరు వరకు ఎఫ్ఐఆర్ నమోదైన 156 కేసులకు సంబంధించిన 278 బాధితులకు రూ.3.90 కోట్ల పరిహారం అందించామన్నారు. కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, అందజేయడంతోపాటు ఇతర రక్షణ బాధ్యతలు తీసుకుంటూ, 74 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు సరఫరా చేస్తామన్నారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులను దాదాపుగా క్లియర్ చేశామన్నారు. సమావేశంలో జేసీ విష్ణు చరణ్, డీఆర్వో పద్మజ, అధికారులు పాల్గొన్నారు.

సేతురామన్‌ను అభినందించిన కలెక్టర్

అహోబిలం దేవస్థాన కమ్యూనికేషన్ అధికారి కిడాంబి సేతురామన్‌ను కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అభినందించారు. అహోబిలం జాతీయ ఉత్తమ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్, జేసీని సేతురామన్ కలువగా అభినందించారు.

మూడు తీర్మానాలకు ఆమోదం


కౌన్సిల్ సమావేశం మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మారుఫ్ ఆసియా

ఆత్మకూరు, సెప్టెంబరు 28: కౌన్సిల్ సమావేశంలో మూడు తీర్మానాలకు ఆమోదం తెలిపినట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాల నిర్వాహణకు హాలు ఏర్పాటు, పట్టణంలోని వార్డు సచివాలయాల్లో స్టేషనరీ కొనుగోలు, ప్రభుత్వం మంజూరు చేసే గృహనిర్మాణాలకు సంబంధించి అనుమతులు జారీ చేసేందుకు నిర్దేశించిన ఫీజులు వసూలు చేయాలని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన ప్రాయశ్చిత్త శాంతి హోమం


పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, భక్తులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 28: నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సర్వశాంతి సంప్రోక్షణ, సుదర్శన ప్రాయశ్చిత్త శాంతి హోమం నిర్వహించారు. హోమం అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కోదండరామాలయం, కాశీవిశ్వేశ్వరాలయ స్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల అర్చకులు, కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, ప్రార్థసారధికృష్ణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయంలో వైసీపీ నాయకుల పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న వైసీపీ నాయకులు

గడివేముల, సెప్టెంబరు 28: తిరుమల లడ్డూ తయారీలో కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వైసీపీ నాయకులు శనివారం బాలాజీ ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్ గుప్త, మేఘనాథ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రఘుమాధవరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి ఆలయంలో..

నందికొట్కూరు: తిరుమల పవిత్రత, లడ్డూ ప్రసాదానికి ఉన్న విశిష్టతను సీఎం చంద్రబాబు అపవిత్రం చేసేందుకు ప్రయత్నించాడని నందికొట్కూరు వైసీపీ సమన్వయకర్త ధార సుధీర్ ఆరోపించారు. శనివారం నందికొట్కూరులోని చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సోముల సుధాకర్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ మన్సూర్ అహ్మద్, మండల కన్వీనర్‌లు లోకేశ్వరరెడ్డి, నాగరాజు, పుల్యాల నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీఎం విద్యాసంస్థలకు జాతీయ స్థాయి ర్యాంకులు


ర్యాంకుల గుర్తింపు పత్రాలు అందుకుంటున్న ఆర్జీఎం డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, హెచ్‌వోడీ డాక్టర్ సుబ్బారెడ్డి

పాణ్యం, సెప్టెంబరు 28 : జాతీయ ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎడ్యుస్కిల్స్ ద్వారా ఇంజనీరింగ్ కళాశాలలకిచ్చే ఎడ్యుస్కిల్స్ ఇంటర్న్‌షిప్ అవార్డులను ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలు అందుకున్నాయి. శనివారం కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి ఆర్జీఎం మూడవ ర్యాంకు, శాంతిరాం ఐదవ ర్యాంకు పొందాయన్నారు. అలాగే వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నాయన్నారు. శనివారం న్యూఢిల్లీలోని అంబేడ్కర్ భవన్‌లో ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, ఏపీ రాష్ట్ర కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ కె, రామమోహన్‌రావు చేతుల మీదు గా ఆర్జీఎం డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, శాంతిరాం ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ సుబ్బారెడ్డి, ర్యాంకుల పత్రాలు అందుకున్నారన్నారు. సమావే శంలో ప్లేస్‌మెంట్ అధికారి సుధీర్‌కుమార్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

పాణ్యం, సెప్టెంబరు 28 : విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని పాణ్యం ఎంపీపీ ఉశేన్‌బీ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన నియోజక వర్గ క్రీడలను ఆమె ప్రారంభించారు. ఈ పోటీలలో కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో క్రీడల్లో అండర్ 14, 17 విభాగాల క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖోలో పాణ్యం బాలురు, బాలికలు, అండర్ 17 విభాగంలో గడివేముల, ఓర్వకల్లు విద్యార్థులు విజయం సాధించారు. క్రీడా కారులకు టీడీపీ నాయకులు రాంపుల్లారెడ్డి రూ.16 వేలు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. అలాగే జాతీయ క్రీడాకారుడు నాగగోపేశ్వరరావు, ఎం ఈవో సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు రంగరమేష్ క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లవి, ఎంఈవో సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం మేరీసునీత, టీడీపీ, జనసేన నాయకులు జయరామిరెడ్డి, రామ్మోహన్ నాయుడు, జగదీశ్‌బాబు పాల్గొన్నారు.

నేటి యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్


ఆత్మకూరు జూనియర్ కళాశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 28: దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమా ర్, డీవైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు రామ్‌నాయక్ అన్నారు. శనివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సాయి, ప్రశాంత్, రవి, బాలాజీ, భరత్, మురళీ తదితరులు ఉన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజరాజేశ్వరి హైస్కూల్ ఏవో రామవేంద్రరావు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

బండిఆత్మకూరు, సెప్టెంబర్ 28: ప్రతి ఒక్కరం పర్యావరణాన్ని పరిరక్షిద్దామని డిప్యూటీ డీఈవో మహమ్మద్ బేగ్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనందరావు, ప్రిన్సిపాల్ రఫీ అన్నారు. శనివారం బండిఆత్మకూరు మోడల్ స్కూల్‌లో విద్యా కమిటీ చైర్మన్ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులు మొక్కలు నాటారు. భావితరాల మనుగడ కోసం మనమంతా పర్యావరణాన్ని కాపాడాలని నేషనల్ గ్రీన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్, ఎండీవో వాసుదేవగుప్త, మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ నూతన భవనం రద్దుపై తీర్మానం

- ఆమోదం తెలిపిన మెజార్టీ కౌన్సిలర్లు
- సమావేశంలో గందరగోళం


కౌన్సిలర్ల మధ్య జరుగుతున్న వాగ్వాదాన్ని వారిస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు, సెప్టెంబరు 28: మున్సిపల్ నూతన భవనాన్ని రద్దు చేయాలంటూ కౌన్సిల్‌లో తీర్మాణం ప్రవేశపెట్టారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని జైకిసాన్ పార్కులో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణానికి దూరంగా మున్సిపల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారంటూ కౌన్సిలర్లు తీర్మాణం ప్రవేశపెట్టారు. పట్టణానికి రెండు కిలో మీటర్ల దూరం ఉండడంతో పాటు, అక్కడ శ్మశానం, డంప్ యార్డు కూడా ఉండడంతో పట్టణ ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని, ప్రస్తుతం ఉన్న స్థలంలోనే మున్సిపల్ నూతన భవనాన్ని నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. సమావేశం చివరి దశలో అంతా గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గానికి చెందిన రెండవ వార్డు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ అజెండాలోని తీర్మాణాలను మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదం తెలిపే వాటి వివరాలు తెలుపుతుండగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వర్గానికి చెందిన రావూఫ్ తన వార్డులో సమస్య ఉందనడంతో అతడికి అవకాశం కల్పించారు. ఆ తర్వాత జాకీర్ హుస్సేన్ మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా, 12వ వార్డు కౌన్సిలర్ లాలుప్రసాద్ మైక్ తీసుకోగా.. జాకీర్‌హుస్సేన్ తాను మాట్లాడేది పూర్తి అయ్యాక మాట్లాడండి అని చెప్పడంతో సభలో గందరగోళం నెలకొంది. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో అక్కడ ఉన్న పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం జోక్యం చేసుకోవడంతో సమస్య సర్దుమనిగింది. దీంతో సమావేశం అర్ధాం తరంగా నిలిచిపోయింది. సమావేశంలో కమిషనర్ బేబి, వైస్‌చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

6 నుంచి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


పోటీల కరపత్రాలను విడుదల చేస్తున్న మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 28 : నంద్యాలలో అక్టోబరు 6నుంచి జాతీయస్థాయి బాల, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ పోటీల బ్రోచర్లను శనివారం గురురాజ పాఠశాల ఆవరణలో ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42వ బాల, బాలికల జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు రామకృష్ణ పీజీ కళాశాల, గురురాజా పాఠశాల సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నంద్యాలలో జాతీయ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని, ఐదురోజులపాటు జరిగే పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు గురురాజా పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పోటీలు రామకృష్ణ పీజీ కళాశాల క్రీడామైదానంలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పీడీలు శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, దాసు, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు రేబిస్ ఇంజక్షన్ తప్పనిసరి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 28: కుక్క కాటుకు నిర్లక్ష్యం తగదని, వెంటనే యాంటి రేబిస్ ఇంజ క్షన్ తప్పనిసరిగా వేయించు కోవాలని వైద్యాధికారి పవన్ కుమార్ సూచించారు. శనివా రం జాతీయ రేబిస్ వ్యాధి నియంత్రణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్ద అనంతాపురం గ్రామంలో కుక్క కాటు- రేబిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాద్, ఇందిరా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమా మహేశ్వరాలయంలో చోరీ

ఆత్మకూరు, సెప్టెంబరు 28: ఆత్మకూరు పట్టణంలోని ఉమామహేశ్వరాలయంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగుడు ఆలయం తాళాలను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని హుండీని పగులకొట్టి సొత్తును ఎత్తుకెళ్లాడు. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న అర్చకులు చోరి జరిగిందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి ఆత్మకూరు అర్బన్ సీఐ ఓబులేసు చేరుకుని పరిశీలించారు. ఆలయ అర్చకులు శరత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉంటే చోరీ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ఆ ఫుటేజ్ ద్వారా దొంగను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

అవినీతి, అక్రమాలను అడ్డుకోలేరా?


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న మాబువలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 28 : నంద్యాల మున్సిపాల్టీలో జరిగే అవినీతి, అక్రమాలను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాబువలి ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి వైసీపీ కౌన్సిలర్లు గళమెత్తారు. వివిధ వార్డుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధ్వజమెత్తారు. అసలు నంద్యాల మున్సిపాల్టీలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడంలేదని, ప్రజలనుంచి పన్ను వసూలు చేస్తున్నప్పటికీ వార్డుల్లోని సమస్యలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు మున్సిపాల్టీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా నంద్యాల ప్రతాప్ థియేటర్ ఎదురుగా వందేళ్ల చరిత్ర ఉన్న పాలకొమ్మ చెట్టును కొట్టేసి ఆ ప్రభుత్వ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారన్న విషయాన్ని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ మాబున్నిసా టీపీవో అధికారులను అడగ్గా నిర్మాణానికి అన్ని అనుమతులున్నాయని చెప్పడంతో దుమారం రేగింది. ఈ అంశంపై కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

ఆత్మకూరు, సెప్టెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించిన స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమానికి సంబంధించి శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయిలో వివిధ ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈడీవో మోహన్‌కుమార్, ఎంఈవో-2 సురేష్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిం చేలా పాఠశాల, కాంప్లెక్స్ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ పోటీలు నిర్వ హించి అందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మండల స్థాయికి ఎం పిక చేసి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబ ర్చిన వారు ఈ నెల 30న నంద్యాలలోని హోలిక్రాస్ హైస్కూల్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు ఉన్నారు.

బుక్ కీపర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 28: జూపాడుబంగ్లా గ్రామపంచాయతీలోని అరుణోదయ గ్రామైక్య సంఘంలో బుక్‌కీపర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని వెలుగు ఏపీఎం అంబమ్మ శనివారం తెలిపారు. గ్రామంలో కాపురం ఉండి గ్రామసంఘంలో పొదుపు మహిళగా ఉండడమే కాకుండా 20 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని చెప్పారు. అక్టోబరు 3లోపు దరఖాస్తు చేసుకోవాలని 5వతేదీ ఎంపిక చేస్తామని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


చెలిమిళ్లలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాములపాడు, సెప్టెంబరు 28: మండలంలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి రత్నరూర్, ఎంపీడీవో గోపి క్రిష్ణ తెలిపారు. శనివారం మండలంలోని చెలిమిళ్ల గ్రామంలో మన ఇళ్లు, మన గౌరవం కార్యక్రమం సర్పంచ్ క్రిష్టారెడ్డి అధ్యక్షతన లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన 62 గృహాలలో 35 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మిగతా 27 బేస్‌మెంట్, లెంటల్ లెవెల్, రూఫ్ లెవెల్ ఉన్నాయని తెలిపారు. వచ్చే ఏడాది 2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని లేదంటే బిల్లులు రావని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీను, టెక్నికల్ అసిస్టెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు మండలంలో ఆయా గ్రామాల్లో ఎంపీడీవో జీఎస్ఎస్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ షానవాజ్, ఈవోఆర్డీ ఫక్రుద్దీన్, హౌసింగ్ ఏఈ భాస్కర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో మన ఇళ్లు మనగౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు. బిల్డింగులు పెండింగులో ఉన్నవారు నిర్మించుకోవాలని వారు సూచించారు. ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో జీఎస్ఎస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఆయాగ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ వాసుదేవుడు సూచించారు. శనివారం బండిఆత్మకూరులో మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య, కార్యదర్శి నటరాజ్, ఈఏ జకిరియా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఏవై పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుంటేనే కేంద్రం నుంచి వచ్చే నిధులు వస్తాయని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ శివారులోని లేవుట్ 3లో లబ్దిదారులతో కమిషనర్ బేబి, హౌసింగ్ డీ.ఈ విజయబాబుల ఆధ్వర్యంలో అయన మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ అనిల్, సిబ్బంది రాజు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం: గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు 2025 మార్చి 31 వ తేదీ లోపల పూర్తి చేసుకోవాలని తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి సూచించారు. స్థానిక మేకల బండ కాలనీలో శనివారం గృహ నిర్మాణ లబ్దిదారులతో గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రంగరమేష్, హౌసింగ్ ఏఈ అహ్మద్‌బాష, ఎంపీడీవో దస్తగిరి, ఈఓఆర్డీ సులోచన, కార్యదర్శి ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: ప్రభుత్వం లబ్దిదారులకు మంజూరు చేసిన గృహాలను వచ్చే ఏడాది మార్చి 31లోపు పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ లబ్దిదారులకు సూచించారు. శనివారం కొత్తపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వం లబ్దిదారులకు మంజూరు చేసిన లేఅవుట్లలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ పాండురంగ నాయక్ అధ్యక్షతన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏపీవో రేష్మా, ఏపీఎం పుల్లయ్య, ఈసీ శ్రీనివాసులు, కార్యదర్శులు చిన్న స్వామి, స్రవంతమ్మ, అజ్మత్, స్థానిక టీడీపీ నాయకులు మోహన్ యాదవ్, టీఏలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మన ఇల్లు- మన గౌరవం అనే కార్యక్రమం నిర్వహించారు. సొంతింటి కల నెరవేర్చుందుకు గ్రామాల్లో ఉన్న లేఅవుట్లలో గృహాలు మంజూరైన లబ్ధి దారులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామప్రత్యేక అధికారులు గ్రామ సర్పంచల అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్


ప్లేస్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఉద్యోగాలు పొందిన ఎస్వీఆర్ కళాశాల విద్యార్థులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 28: నంద్యాల ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇటీవల టాప్ అకాడమీ సంస్థ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ప్లేస్‌మెంట్ ద్వారా 15మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందారు. క్యాంపస్ సెలక్షన్ ప్రక్రియలో విద్యార్థుల టెక్నికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మూల్యాంకనం చేసి వా రికి తగిన ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల డైరెక్టర్ దినేష్‌రెడ్డి తెలిపారు. కళాశాల యజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలి


పాణ్యం ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

పాణ్యం, సెప్టెంబరు 28 : మండలంలోని పిన్నాపురం గ్రామంలో పంటలను ధ్వంసం చేసిన గ్రీన్‌కో సంస్థపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ మహేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఏపీ రైతు సంఘం కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పట్టా భూముల్లో సాగు చేసిన కంది పంటలను డోజర్‌లతో నాశనం చేశారన్నారు. సోలార్ కంపెనా యాజమాన్యంపై చర్యలు తీసుకొని నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదు, భాస్కర్, కాశీం, రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక

వెలుగోడు, సెప్టెంబరు 28: వెలుగోడు పట్టణంలోని లిటిల్ ఏంజిల్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు ఇమ్మానియేలు తెలిపారు. శనివారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయి క్రీడల్లో కబడ్డీ, చెస్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న కార్తీక్ నంద్యాల జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు, 8వ తరగతి చదువుతున్న దీక్షశ్రీ, 6వ తరగతి చదువుతున్న ముఖీల్ జిల్లా స్థాయి చదరంగ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఏవో ప్రశాంతి, వ్యాయమ ఉపాధ్యాయులు, సహచర సిబ్బంది అభినందించారు.

యాదవులు సంఘటితం కావాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 28: సమాజ ఉన్నతికి యాదవులు సంఘటితం కావాలని అఖిల భారత యాదవ సంఘం రాయలసీమ యువజన విభాగం అధ్యక్షుడు శకునాల శివరామకృష్ణ, ఆత్మకూరు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మన్యం బాలస్వామి యాదవ్ అన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలో యాదవ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్నివారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన యాదవ సంఘం నాయకులు బొల్లు ప్రసాద్ బాబు, కరిముల్లా యాదవ్, పెద్ద వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 28: పట్టణ ప్రజలకు అసౌకర్యంగా ఉన్నడంపింగ్ యార్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, స్వాములు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో చెత్తను వేసేందుకు డంప్‌యార్డు లేకపోవడంతో రోడ్ల పక్కనే వేసి నిప్పంటించడం వల్ల సమీప కాలనీల ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి డంప్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేనియెడల ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి


జాషువా చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 28: నంద్యాల పింగళి సూరన గ్రంథాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శనివారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి పలువురు సాహితీవేత్తలు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని అంటరానితనం మూఢాచారాలపై తిరుగుబాటు చేసి ఛీత్కారాలు పొందినచోట సత్కారాలు పొందిన మహాకవి జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు మహబుబ్‌బాషా, సరసకవి వైష్ణవ వెంకట రమణమూర్తి, వెంకటేశ్వర్లు, నరేంద్ర, ప్రసాద్, ఆచారి, గ్రంథాలయాధికారి శ్రీధర్, మధు, రామచంద్రమూర్తి, కళామురళి, రమేష్, నరసింహులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరబడి సమ సమాజ నిర్మాణ స్ఫూర్తిదాత గుర్రం జాషువ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్, తెలుగు అధ్యాపకుడు విద్యాసాగర్ అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో గుర్రం జాషువ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ తదితరులున్నారు.

దాతలకు ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత


దాతకు శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ ఏఈవో, వేదపండితులు

మహానంది, సెప్టెంబరు 28: మహానందిలో అక్టోంబరు 3నుంచి 13 వరకు జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు తరలిరావాలని మహానంది ఆలయ అధికారులు, వేదపండితులు కోరారు. శనివారం నంద్యాల పట్టణంలోని పలువురు దాతలతో పాటు అధికారులను కలిసి ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలతో పాటు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్ శర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, నాగమల్లయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పాములపాడు, సెప్టెంబరు 28: రైతులు పండించిన మొక్కజొన్న పంటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం పాములపాడులో రైతులు పండించిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూర్ నియోజకవర్గంలో రైతులు మొక్కజొన్న పంటలను సాగు చేశారని, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట నష్టపోయారని, కాస్తో కూస్తో పండిన పంటను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొక్కజొన్న క్వింటా రూ.3200 మద్దతు ధర ప్రకారం నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గోరుకల్లు రిజర్వాయర్‌లో 11 టీఎంసీల నీరు

పాణ్యం, సెప్టెంబరు 28 : గోరుకల్లు రిజర్వాయర్‌కు శనివారం నాటికి పూర్తి స్థాయి నీటిమట్టం 11 టీఎంసీలకు నీరు చేరిందని గోరుకల్లు ఈఈ శుభకుమార్ తెలిపారు. ప్రస్తుతం ఎస్సార్బీసీ ద్వారా 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. వచ్చే రబీ, ఖరీఫ్ పంటలకు నీరు అందేలా చర్యలు చేపట్టామన్నారు. రిజర్వాయర్ నిల్వ స్థాయి 12.44 టీఎంసీలు కాగా ప్రస్తుత నిర్మాణం మేరకు పూర్తిస్థాయిలో నీటిని నిల్వ ఉంచినట్లు తెలిపారు. రిజర్వాయర్‌ను జలవనరుల శాఖ సీఈ కబీర్ పరిశీలించారు. డీఈలు అశ్వర్థనారాయణ, అమృత్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● డీఎంహెచ్‌వో వెంకటరమణ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 28: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో వెంకటరమణ హెచ్చరించారు. శనివారం మండలంలోని మాయలూరు, సంజామల మండలంలోని నొస్సం గ్రామాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ఓపీ, రక్తపరీక్షలు, వ్యాధి నిరోధక టీకా గదులను పరిశీలించారు. పీహెచ్‌సీ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ఏర్పాటు చేసిన పోర్టల్లో గర్భిణుల వివరాల ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కెనెడీ, సిబ్బంది వెంకటసుబ్బారెడ్డి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల ఆసుపత్రి తనిఖీ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 28 : కోవెలకుంట్ల ఆసుపత్రిని శనివారం డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫరుల్లా తనిఖీ చేశారు. రోగుల వద్ద వెళ్లి వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లల విభాగం నంద్యాల జిల్లాలో ఎన్టీఆర్ సేవ ట్రస్టు (ఆరోగ్యశ్రీ)లో, వైద్యసేవలో మొదటి స్థానంలో ఉన్నందున డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం హాస్పిటల్ రికార్డులను పరిశీలించారు.

గ్రామాల్లో క్రీడాభివృద్ధికి రూ.1.40 కోట్లు

చాగలమర్రి, సెప్టెంబరు 28: నంద్యాల జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన ఉన్నత పాఠశాలలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం రూ.1.40 కోట్లు నిధులు మంజూరు చేసిందని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ డీఈ నాగభూషణం రెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో క్రీడావిభాగాల కోర్టులకు కొలతలు వేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎంశ్రీ కింద 28 ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయని అన్నారు. ఒక్కో పాఠశాలలో రూ.5 లక్షలతో క్రీడా మైదానాలను చదును చేయించి ఆటలకు కోర్టులను ఏర్పాటు చేయిస్తామని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఏఈ శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా

● ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, సెప్టెంబరు 28: డోన్ నియోజకవర్గంలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న దంపతులను సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన పదవి బాధ్యతలు చేపట్టిన సుబ్బారెడ్డిని ఈ సందర్భంగా కేఈ జయన్న సన్మానించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలో రైతుల ప్రయోజనాల కోసం ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. బిందు సేద్యాన్ని ప్రోత్సహించేందుకు రాయితీలు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళికృష్ణగౌడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, ఆలా మల్లికార్జున రెడ్డి, మధుసూదన్‌గౌడు, కృష్ణారెడ్డి, ఎర్రిస్వామిగౌడు, రామచంద్రుడు పాల్గొన్నారు.



కేఈ జయన్న దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

బైరెడ్డి శబరిని కలిసిన సుబ్బారెడ్డి

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలను శనివారం రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని ఎంపీ బైరెడ్డి శబరి సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

● రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ధర్మవరం సుబ్బారెడ్డికి అభినందనలు వెలువెత్తాయి. శనివారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో సుబ్బారెడ్డిని టీడీపీ సీనియర్ నాయకులు ఆలంకొండ నబీ సాహేబ్, మర్రి శ్రీరాములు, గురుస్వామి, రఫీ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, రామాంజనేయులు, కలచెట్ల ప్రసాద్, బేతంచెర్ల తిరుమలేష్ చౌదరి, తదితరులు కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 28: కంది పంట పూత దశలో ఉందని రైతులు జాగ్రత్తలు పాటించాలని డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్‌యార్డు సమావేశ భవనంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, సలహాలు, సూచనలు రైతులు ఇస్తూ నష్టపోకుండా చూడాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

శిరివెళ్ల, సెప్టెంబరు 28 : ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ జనార్దన్ సూచించారు. శిరివెళ్లలోని సచివాలయం-1లో గృహ నిర్మాణశాఖపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మన ఇళ్లు- మన గౌరవంలో భాగంగా లబ్ధిదారులు గృహాలను మార్చి, 2025 లోపు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఐఈ నాగ శేఖర్, సర్పంచ్ లక్కాకుల సాలమ్మ, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, టీడీపీ నాయకులు సూరా రామ, బీసీ ఫిదా హుసేన్, అబూబకర్ సిద్ధిఖ్, షఫివుల్లా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో పక్కా గృహాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

చాగలమర్రి: గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలను 100 శాతం పూర్తి చేయాలని బీసీ కార్పొరేషన్ జిల్లా ఈడీ జాకిర్‌హుసేన్ తెలిపారు. సొంత ఇంటి మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శనివారం చాగలమర్రి కస్తూర్బా సమీపంలో లేఔట్‌లలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఈవోఆర్డీ తహిర్‌హుసేన్, హౌసింగ్ ఏఈ షఫివుల్లా, ఏపీఎం నాగమ్మ, హౌసింగ్ సిబ్బంది ఓబులేసు, సలీమ్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: గృహాలను వెంటనే నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి సోమశివారెడ్డి అన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్ఆర్‌బీసీ కాలనీలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సోమశివారెడ్డి మాట్లాడుతూ గృహాలు మంజూరై వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యదున్నీసా, హౌసింగ్ ఏఈ మద్దిలేటి, సిబ్బంది గోవిందు, సుబ్బరాయుడు, గంగాధర్ పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణ లబ్ధిదారులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, ఎంపీడీవో నాగరాజు, తహసీల్దారు నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : ఇల్లు లేని నిరుపేదల గౌరవం నిలబెట్టడమే టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు పేట్నీకోట హుస్సేన్ రెడ్డి అన్నారు. శనివారం మన ఇల్లు .. మనగౌరవం కార్యక్రమంలో భాగంగా కనకాద్రిపల్లెలో వీఆర్ లక్ష్మీరెడ్డి, సర్పంచ్ శివశంకర్, పేట్నీకోటలో హుస్సేన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సత్యారెడ్డి తదితరులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి డా. పద్మావతి, సీనియర్ టీడీపీ నేత అంబటి జయలక్ష్మీరెడ్డి, అంబటి వివేకానందరెడ్డి, కత్తి రాందాస్, టీడీపీ యువ నాయకులు ఉలువల ప్రసాద్, మందా విజయ్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: గ్రామాల్లో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద మంజూరైన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని మండల స్పెషల్ ఆఫీసర్ గోవింద్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని దొర్నిపాడు హౌసింగ్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ బ్రహ్మయ్య ఉన్నారు.

రుద్రవరం: పేదలకు సొంతింటి కల తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని ఆలమూరు గ్రామంలో మన ఇల్లు, మన గౌరవం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన రెడ్డి, టీడీపీ నాయకులు నారాయణ, కత్తి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

బనగానపల్లెను నందనవనంగా తీర్చిదిద్దుతాం

బనగానపల్లె , సెప్టెంబరు 28: బనగానపల్లెను నందవనంగా తీర్చిదిద్దుతామని టీడీపీ నాయకురాలు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల్లో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన బీసీ ఇందిరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉన్నప్పుడే విద్యను ముందుకు కొనసాగిస్తారన్నారు. విద్యార్థులకు జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు బడేసాహెబ్, కౌసల్యాదేవి, ఉమామహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న బీసీ ఇందిరమ్మ

జూనియర్ కళాశాలను అభివృద్ధి చేస్తాం

బనగానపల్లె , సెప్టెంబరు 28: బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి చేస్తామని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శనివారం అన్నారు. కళాశాలలో ముళ్లకంపలు, పిచ్చి మొక్కలతో నిండిపోయిందని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి దృష్టికి కళాశాల అధ్యాపకులు తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన బీసీ రాజారెడ్డి సొంత నిధులతో పిచ్చిమొక్కలను తొలగించారు. బీసీ రాజారెడ్డికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమల లడ్డూపై రాజకీయం చేయడం తగదు

● మాజీ మంత్రి బుగ్గన

డోన్, సెప్టెంబరు 28: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు తిరుమల లడ్డూను కల్తీ చేశారంటూ రాజకీయం చేయడం తగదని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో మధు ఫంక్షన్ హాలు వద్ద నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు కార్యకర్తలతో కలిసి బుగ్గన పాదయాత్ర నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన నివాసంలో మాజీ మంత్రి బుగ్గన మాట్లాడుతూ తిరుమల లడ్డూకు ఉపయోగించే నేయిలో జంతువుల కొవ్వును కలిసి కల్తీ చేశారని సీఎం చంద్రబాబు భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని అన్నారు. అధికారం ఇచ్చిన ప్రజలకు మంచి చేసి మన్ననలు పొందాలని మాజీ మంత్రి బుగ్గన హితవు పలికారు. కార్యక్రమంలో డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మాజీ జడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, పోస్టు ప్రసాద్, బొబ్బల శివరామిరెడ్డి, కౌన్సిలర్ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న బుగ్గన్న

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్నఎంపీడీవో నాగరాజు

బనగానపల్లె, సెప్టెంబరు 28: బనగానపల్లె మండలంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఎంపీడీవో నాగరాజు, తహసీల్దారు నారాయణరెడ్డి, హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్‌తో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తాగునీరు, వ్యవసాయం, రెవిన్యూ, అంగన్‌వాడీ, పశువైద్యం, విద్యుత్, పంచాయితీరాజ్ తదితర శాఖలపై చర్చ జరిగింది. సమావేశంలో ఒకరిద్దరు ఎంపీటీసీ, సర్పంచ్ తప్ప మిగతా సభ్యులు ఎలాంటి ప్రశ్నలు అడగకపోవడం విశేషం. అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతిని వివరిస్తూ వెళ్లిపోయారు. ముఖ్యంగా చిన్నరాజుపాలెంతాండాలో త్రాగునీటికి సంబంధించి పైప్‌లైన్‌లు మాయమయ్యాయని వాటికి సంబంధించి విచారణ చేయాలని కృష్ణానాయక్ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, తహసీల్దారు నారాయణరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ, హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, పంచాయితీ రాజ్ ఏఈ మహేశ్, రమణ, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 28 : మండలంలోలని పలు గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు సమస్యల పరిష్కారం కోసం మంత్రి బీసీ జనార్దనరెడ్డికి నతులు సమర్పించారు. కొలిమిగుండ్ల మండలంలోని అబ్దులాపురం, కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె తదితర గ్రామాలకు చెందిన పలువురు బాధితులు బనగానపల్లెలోని మంత్రి కార్యాలయానికి వెళ్లి వైసీపీ హయాంలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. అలాగే గ్రామాల్లోని సమస్యలను పరిష్కారించాలని కోరారు.



మంత్రికి సమస్యలు వివరిస్తున్న మహిళలు

జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలకు అభినందన



అవార్డు గ్రహీతలకు సన్మానం చేస్తున్న ఏపీయూఎస్ నాయకులు

చాగలమర్రి, సెప్టెంబరు 28: చాగలమర్రి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అవార్డుగ్రహీతలుగా ఎంపికైన కృష్ణశాస్త్రి, శ్రీనివాసులను శనివారం హెచ్ఎం కోటయ్య ఆధ్వర్యంలో ఏపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి, బుచ్చిబాబు శాలువాతో సన్మానించి, మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, భారతి, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్ఏ కుటుంబాన్ని ఆదుకుంటాం

రుద్రవరం, సెప్టెంబరు 28 : మండలంలోని ఎర్రగుడిదిన్నెకు చెందిన తోకల రామచంద్రుడు(50) అనే వీఆర్ఏ శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రుద్రవరం తహసీల్దారు మల్లికార్జునరావు గ్రామానికి చేరుకుని వీఆర్ఏ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య శాంతమ్మకు తక్షణ ఆర్థిక సాయం కింద రూ.10వేలు తహసీల్దారు అందించారు. అలాగే మండల వీఆర్ఏల సంఘం తరపున రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర ప్రసాద్, వీఆర్ఏలు దేవదానం, జంబులయ్య పాల్గొన్నారు.



వీఆర్ఏ భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న తహసీల్దారు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం పదిలం

శిరివెళ్ల, సెప్టెంబరు 28 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని భజరంగదళ్ నంద్యాల జిల్లా కన్వీనర్ భోగిరెడ్డి నాగిరెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో బజరంగదళ్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయ్ కుమార్, భజరంగదళ్ జిల్లా కో-కన్వీనర్ కమతం రాజశేఖర్‌రెడ్డి, నిరంజన్, రాము, దామోదర్ పాల్గొన్నారు.



యర్రగుంట్లలో కార్మికులకు గ్లౌసులు పంపిణీ చేస్తున్న బజరంగదళ్ ప్రతినిధులు